వినాయక చవితికి సర్వం సిద్ధం

- నవరాత్ర ఉత్సవాలకు ఆలయాల వద్ద పందిళ్లు ఏర్పాట్లు
- కొనుగోళ్లతో మార్కెట్ల కళకళ



రావులపాలెంలో చవితి పూజాసామగ్రి అమ్మకాలతో కిక్కిరిసిన రింగ్ రోడ్డు మార్కెట్

కొత్తపేట/మామిడికుదురు/రావులపాలెం/అంబాజీపేట/అయినవిల్లి/పి.గన్నవరం/ఆత్రేయపురం: హిందూ సంప్రదాయ ప్రధాన పండగల్లో ఒకటైన వినాయకచవితిని ఘనంగా జరుపుకొనేందుకు సర్వం సిద్ధమయ్యారు. పట్టణాలు, గ్రామీణాలు అనే తేడా లేకుండా ఆదివారం ఎక్కడికక్కడ చవితి సందడి నెలకొంది. సోమవారం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు భక్తులు, ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆయా కమిటీల సభ్యులు సర్వం సిద్ధం చేసుకున్నారు. నియోజకవర్గంలో గ్రామగ్రామాన గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ గణపతి ఆలయాలు ఉండగా ఆ ఆలయలతో పాటు అనేక వీధుల్లో ప్రత్యేకంగా ఉత్సవ పందిళ్లు ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. చవితి పురస్కరించుకుని ఆలయాలను రంగులతో, తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. నవరాత్రుల్లో రంగు రంగుల విద్యుత్ దీపాల సెట్టింగులు కనువిందు చేయనున్నాయి.

మార్కెట్‌లు కళకళ

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వినాయక విగ్రహాలు, పాలవెల్లులు, పండ్లు, పువ్వులు, పత్రి, ఇతర పూజాసామగ్రి, వస్తువులు, వస్త్రాల మార్కెట్లు జనంతో కిటకిటలాడి కళకళలాడాయి. అనేక ప్రధాన గ్రామాల కూడళ్లలో పై సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయగా వాటి కొనుగోళ్లకు గ్రామాల నుంచి జనం తరలిరావడంతో ఆయా మార్కెట్ సెంటర్లలో చవితి సందడి నెలకొంది. అంబాజీపేటలో విగ్రహాల తయారీ దారులు రెండు అడుగుల నుంచి 6 అడుగుల వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేసుకున్నారు. కాలుష్య రహితంగా ఉండే మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని వైద్యులు, శాస్త్రవేత్తలు తెలియజేయడంతో మట్టి విగ్రహాలకు ప్రాముఖ్యం ఎక్కువగా పెరిగిందని తయారీదారులు చెబుతున్నారు. వినాయక చవితి సందర్భంగా ఇరుసుమండలో కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమ, వ్రతకల్పాన్ని ప్రతి ఇంటికి ఆదివారం అందజేశారు.



మామిడికుదురులో కిటకిటలాడుతున్న మార్కెట్



చవితికి ముస్తాబైన కొత్తపేట కళానగర్ గణపతి ఆలయ ప్రాంగణం

క్లుప్తంగా

బాల గణపతికి మకరతోరణం సమర్పణ



బాలగణపతికి సమర్పించిన ఇత్తడి మకర తోరణం

అంబాజీపేట: మాచవరం శివారు సత్యసాయినగర్‌లో వేంచేసిన బాలగణపతి స్వామి వారికి ఇత్తడి మకరతోరణాన్ని స్థానిక భక్తులు ఆదివారం సమర్పించారు. బచ్చు నాగ వెంకట సత్యనారాయణ, పద్మావతి దంపతులు, కుమారులు రామారావు, రాముల ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే ఇత్తడి మకర తోరణం స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో మకరతోరణానికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వేద సభ

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రంలో ఆదివారం వేద సభ వైభవంగా నిర్వహించారు. సత్రం చైర్మన్ కోపెల్ల మల్లి అధ్యక్షతన జరిగిన ఈ వేద సభలో వేద పండితులు పాల్గొని చతుర్వేద పారాయణ చేశారు. భాద్ర శుద్ధ విదియా సందర్భంగా ఈ వేద సభ నిర్వహించినట్టు ఈవో రాధాకృష్ణ తెలిపారు.

విద్య, వైద్యానికి 'వేగేశ్న' చేయూత

ఆత్రేయపురం: గ్రామానికి చెందిన వేగేశ్న ప్రసాదరాజు విద్య, వైద్యానికి సంబంధించి పలువురికి చేయూతనిస్తున్నారు. ఆదివారం గ్రామంలో విద్యార్థులు ఎ.మౌనిక, కె.జగదీష్ వర్మలకు తలా రూ.5 వేలు, అల్లూరి లహరికి రూ.10 వేలు, హెచ్.రవివర్మ, బుల్లి పాల్, వి.ప్రభాస్ వర్మ, సూర్యవర్మలకు తలా రూ.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్.సత్యవతికి రూ.10 వేలు, బస్వంత్ రూ.5 వేలు నగదు రూపంలో అందించారు. ప్రసాదరాజును పలువురు అభినందించారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న యోగా ఆశ్రమం సభ్యులు

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు 23 మంది రక్తదానం చేసినట్లు యోగా గురువు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికోసం, అలాగే తలసేమియా, గర్భిణులకు, వివిధ ఆరోగ్య సమస్యలతో రక్తం అవసరమైన వారి కోసం తమ సభ్యులు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. అమలాపురంలోని గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకులో తమ సభ్యులు రక్తదానం చేశారని, నేటితో 15 వేల మందికి పైగా తమ సభ్యులు రక్తం అందించినట్లు ఆయన వివరించారు.

అనారోగ్య బాధితులకు సాయం



లబ్ధిదారులకు సాయం అందిస్తున్న బుజ్జిరాజు, బోనం రాజు

మలికిపురం: నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. రాజోలు మండలం శివకోటికి చెందిన గెడ్డం సౌదామణికి రూ.10 వేలు, మలికిపురం మండలం టి.సావరానికి చెందిన కడలి లక్ష్మీప్రసన్నకు రూ.10 వేలు ఆర్థికసాయంగా అందించారు. వీరి అనారోగ్య పరిస్థితులను చైర్మన్ వెంకటరామరాజు దృష్టికి స్థానిక ప్రతినిధులు తీసుకెళ్లగా స్పందించి ఈ ఆర్థిక సాయాలను ఆయన పంపారు. స్థానిక వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోనం రాజు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో అల్లూరి మధురాజు, అటారం మాస్టారు, దొంగ సతీష్, డాక్టర్ యాండ్ర రాంబాబు, స్టూడియో వర్మ, జిల్లెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఫణీంద్ర



కాసు ఫణీంద్ర

అంబాజీపేట: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కోనసీమ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడిగా అంబాజీపేటకు చెందిన కాసు ఫణీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తూనుగుంట్ల రామకృష్ణ నుంచి నియామక ఉత్తర్వులను ఫణీంద్ర అందుకున్నారు. ఈ పదవిలో ఫణీంద్ర మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈ కాలంలో ఫణీంద్ర తన వంతు కృషిగా పలుసేవా కార్యక్రమాల్లో పాల్గొనటమే కాకుండా మహాసభ అభివృద్ధికి ఇతోధికంగా పాటుపడుతూ, మహాసభలో పలువురుని సభ్యులుగా చేరుస్తూ బలోపేతానికి కృషి చేయాలని గ్లోబల్ అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. ఫణీంద్ర నియామకంపై స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి సంఘ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. కాగా తన నియామకానికి కృషి చేసిన ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు కొన శ్రీనివాస్‌కు ఫణీంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నగరంలో డ్రైన్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నగరం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.42.45 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నాలుగు అండర్ గ్రౌండ్ డ్రైన్లతో పాటు మూడు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, ఒక గ్రావెల్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కార్యాచరణ చేపడుతున్నామని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. గెయిల్ నిధులతో చేపట్టిన డ్రైన్ నిర్మాణం ద్వారా డ్రైనేజ్ సమస్య చాలా వరకు పరిష్కారమైందని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణం ద్వారా ఈ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీ జాలెం అనూష, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, వార్డు మెంబర్ తవిటికి లక్ష్మి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కడలి శ్రీను, తవిటికి వెంకన్నబాబు, జాలెం కృష్ణారావు, కార్యదర్శి తాడి ఏసుబాబు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన ఈతకోట హైస్కూల్ విద్యార్థులు

రావులపాలెం: ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఈతకోట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేవీఎస్‌వీ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. అండర్–17 విభాగంలో సీహెచ్ లక్ష్మీసాయిశ్రీ కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, యోగా లోను, కె.మీనా అమృతసత్య వాలీబాల్, త్రోబాల్‌లోను ఎం.స్వరగీతిక వాలీబాల్, త్రోబాల్‌లోను ఎం.వీరవేణి ఖోఖోలోను, కె.యక్షిత యోగాలోను, కె.దివ్యదుర్గ మహేశ్వరి యోగాలోను, వై.రిషిత షటిల్‌లోను జిల్లాకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్–14 విభాగంలో వై.లావణ్య వాలీబాల్, కబడ్డీలను డి.కల్పన వాలీబాల్, కె.మంజుశ్రీ త్రోబాల్, కె.మహర్షిత వాలీబాల్‌లోను, సీహెచ్ లక్ష్మీప్రియ కబడ్డీ, యోగా పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. త్వరలో అనపర్తిలో జరిగే జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆయా విభాగాల్లో పాల్గొంటారని పీఈటీ రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు



లక్కవరంలో పండ్లు, రొట్టెలు అందిస్తున్న బీజేపీ నాయకులు



మొగలికుదురులో పండ్లు పంచుతున్న బీజేపీ నేతలు

మలికిపురం: భారత ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును మలికిపురం మండలం లక్కవరం పీహెచ్‌సీలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో, పార్టీ శ్రేణులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలువురికి మిఠాయిలు పంచి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా కత్తిమండ వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శృంగారపు సూర్యప్రకాశరావు, మండల పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర బీజేపీ కోఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస్ నగేష్ , జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానికంగా ప్రధాని మోదీ పుట్టినరోజును బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాచి. పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు మిఠాయిలు పంచారు. తొలుత స్థానిక శివాలయంలో పార్టీ శ్రేణులు ప్రధాని మోదీ పేరుతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మామిడికుదురు శివాలయంలో మోదీ పేరిట అభిషేకాలు చేయించారు. మొగలికుదురు శ్రీసత్యసాయి భరోసా దీన జనోద్ధరణ కేంద్రంలో వృద్ధులు, చిన్నారులకు రొట్టెలు, పాలు, పండ్లు పంచారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధికి చేరిన పవిత్రాలు



అంతర్వేది స్వామివారి సన్నిధికి చేరిన అహోబిలం పవిత్రాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి అహోబిలం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి పవిత్రాలు ఆదివారం చేరాయి. ఈ నెల 23 నుంచి 26 వరకూ నాలుగు రోజుల పాటు అంతర్వేది ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలను అర్చకులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పవిత్రాలను అహోబిలం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అంతర్వేదికి తీసుకువచ్చారు. ఏసీ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయసారథి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సుందరకాండ కథామృతం

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుందరకాండ గాన కథామృతం కనులపండువగా నిర్వహించారు. కవి మారేమండ బాలభాస్కర్‌రావు ఆలపించిన సుందరకాండ గానామృతంలో భక్తులు పాల్గొని తిలకించారు. తొలుత బాలభాస్కర్‌రావును ఆలయ చైర్మన్ పాతపాటి రమణరాజు–రాజ్యలక్ష్మి దంపతులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం ఆలయ ఆవరణలో సుందరకాండ గాన కథామృతంపై భక్తులకు వివరించారు. అనంతరం ఆయనకు ఆలయ చైర్మన్ దంపతులు స్వామి చిత్రపటం అందజేశారు.

లబ్ధిదారుల మదిలో సీఎంకు సుస్థిర స్థానం

ఎమ్మెల్యే రాపాక



తాటిపాకలో లబ్ధిదారుకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా తేటతెల్లమవుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం తాటిపాకలోని ఆర్యవైశ్యుల వీధి, జమ్మి చెట్టు సెంటర్, శివాలయం వీధి, గొల్లగూడెం ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా లబ్ధిదారుల ముఖాల్లో సంతోషం కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు సొంత పార్టీ నాయకుల జేబుల్లోకే వెళ్లేవని, ప్రస్తుతం సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయన్నారు. ఎన్ని అరాచక శక్తులు కలసినా రాష్ట్రంలో జగన్ గెలుపుని అడ్డుకోలేవన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరురాణి, మండల పార్టీ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, గుబ్బల మనోహర్, మద్దుల కాసు, బొంతు రమేష్, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



రావులపాలెంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



రాజోలులో విశ్వకర్మ జయంతి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం: ప్రపంచ తొలి వాస్తుశిల్పి, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మ భగవానుని జయంతి సందర్భంగా ఆదివారం రావులపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేవతల ఆయుధాలు, వాహనాలు, రాజభవనాల సృష్టికర్త జయంతిలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ర్యాలి రాజశేఖర్, సాంబమూర్తి, కోటేశ్వరరావు, సాయి తదితరులు విశ్వకర్మ జయంతిని ఆంధ్రప్రదేశ్ అధికారికంగా గుర్తించడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, వార్డు సభ్యులు సఖినేటి వాకులరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం దేవశిల్పి విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రాజోలు: విశ్వకర్మ జయంతిని రాజోలులో వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రాజోలు వశిష్ఠా నదీతీరానికి స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో గొల్లపల్లి వరప్రసాద్, పద్మావతి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. ప్రతి ఏటా సెప్టెంబరు 17వ తేదీన జరిగే విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు సీఎం జగన్ ప్రత్యేక జీఓను విడుదల చేయడంపై సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పీఎం విశ్వకర్మ పథకం ప్రారంభించడంపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ దార్ల పెదబాబు, కొమ్మోజు అచ్యుత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

అంబాజీపేట: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ అన్నారు. వినాయక చవితి ఉత్సవాలు, మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విగ్రహం సైజు, మందిరం ఎక్కడ ఏర్పాటు చేస్తారనే అంశాలకు సంబంధించి అనుమతి పొందలన్నారు. ఉత్సవాలు నిర్వహణ కమిటీగా ఏర్పడి ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు వారే పూర్తి బాధ్యత వహించాలన్నారు. మండపాల వద్ద వేదికలు, సినీ, రాజకీయ నాయకుల ఉపన్యాసాలు, ఫ్లెక్సీలు పెట్టవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు నిర్వహించుకునేలా అందరూ సహకరించాలన్నారు.

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా వినాయకుని మండపాలకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని ఎస్సై హరికోటి శాస్త్రి సూచించారు. ఎక్కడ మండపాలు ఏర్పాటు చేసినా, నిర్వాహకులు పోలీస్ పర్మిషన్ తీసుకునే విధంగా వలంటీర్లు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు చూడాలని ఆయన ఆదేశించారు. మండపాల వద్ద, నిమజ్జనం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

పంటకాలువలో పడిన ఆటో

రాజోలు: వెనుక నుంచి గుర్తుతెలియని కారు వేగంగా ఒక ఆటోను ఢీ కొట్టడంతో రాజోలు కాటన్ పార్కు సమీపాన పి.గన్నవరం ప్రధాన పంటకాలువలోకి ఆదివారం ఆటో పడిపోయింది. ఆటో పంటకాలువలో పడిపోయిన సమయంలో ఆటోడ్రైవర్‌తో పాటు ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. పంటకాలువలో పడిపోయిన ఆటోను రక్షించే ప్రయత్నాల్లో ఆటోను ఢీకొట్టిన కారు తప్పించుకుని వేగంగా తాటిపాక వైపు వెళ్లిపోయింది. ఆటోలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పంటకాలువలో పడిపోయిన ఆటోను తాళ్ల సాయంతో బయటకు తీశారు. ఆటో యూనియన్ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అనారోగ్య బాధితురాలికి ఎమ్మెల్యే సాయం



అనారోగ్య బాధితురాలి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఆలమూరు మండలం పెనికేరుకి చెందిన గాడా బేబమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదు సాయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆమె కుటుంబసభ్యులకు ఆదివారం అందజేశారు. మండలంలోని గోపాలపురంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ సాయాన్ని ఆయన అందజేశారు.

500 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఈఓ కృష్ణచైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం వద్ద ఆదివారం 500 మట్టి వినాయకుని విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..



మలికిపురంలో వినాయక మట్టి ప్రతిమలు అందిస్తున్న రొటేరియన్లు

మలికిపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మలికిపురంలో మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాలుష్య నివారణ కోసం మట్టి ప్రతిమలనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సోమిశెట్టి మురళీకృష్ణ, బత్తుల సంపత్‌కుమార్, కోశాధికారి తోలేటి సతీష్, రిటైర్డ్ తహసీల్దార్ బత్తుల ఝాన్సీ, రాపాక విజయరావు, పశు సంవర్ధక శాఖ రాష్ట్ర ఏజేడీ డాక్టర్ గొల్ల జేసురత్నం, నల్లి శివకుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

పి.గన్నవరం: ఈనెల 19 నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో అండర్–14, అండర్–17 స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. ఆదివారం పి.గన్నవరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల స్థాయి పోటీల్లో ఎంపిక అయిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మూడు రోజుల పాటు పోటీలు జరుగుతా యని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల సమన్వయ కర్త కేవీ రమణ, ఎంఈఓ–2 చింతా వీరభద్రం, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్న న్యాక్ కమిటీ

రావులపాలెం: కళాశాల మౌలిక సదుపాయాలు, బోధనాంశాలను పరిశీలించి గ్రేడ్ ఇచ్చేందుకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) (బెంగళూరు) కమిటీ బృందం ఈ నెల 20, 21 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ఆ కమిటీ బృందం కళాశాలకు సంబంధించిన ఏడు రకాలుగా ఉన్న వివిధ విభాగాల విద్యా ప్రమాణాలను చూసి పరిశీలించి గ్రేడింగ్ ఇస్తుందన్నారు. అయితే ఇప్పటి వరకూ రెండు పర్యాయాలు న్యాక్ కమిటీ పరిశీలించి బీ–గ్రేడ్ ఇచ్చిందన్నారు.